



్రావు ఇంటివైపు కారు మళ్ళించాడు. సదానందం లాటి (క్షరీమీద లక్షలుఖర్చుపెట్టే వాళ్ళకు ప్రియ మిత్రుడు. మనిషిగా అందగాడు, మనిషిగా బ్రతికి వున్న రోజుల్లో ఏదో ఆఫీసులో మేనేజర్‌గా వుండే వాడు. ఇతరమార్గాలు తొక్కకుండా- వచ్చినజీతం తింటూ చాలాకాలం గుర్తింపులేకుండా బతికాడు. లక్షలమీద నడిచే బిజినెస్సుకోసం రెండొందల యాభై జీతంతో చెమటోడ్చి పనిజేసి యజమానికి డబ్బుసంచులందించాడు. తన శ్రమతో యజమాని కులకడం కొన్నాళ్ళుపోయాక పరాత్పరరావుకు నచ్చలేదు. ఎంతకాలమైనా తను కోరుకున్న జాలీ బ్రతుకు తను నమ్ముకున్న నీతినియమాలు, తన డిగ్రీ చదువూ చేకూర్చలేవన్న నిజం అతడు తెలుసు కోగానే తన బ్రతుకు కొకప్లాను వేసుకొన్నాడు. ఆ ప్లాను సఫలుపర్చడానికి అడ్డంగా నిలిచివున్న నీతిని తక్షణం విడిచిపెట్టాడు. సులువైన మార్గంలో పైకి రావడానికి సమయంకోసం కాచుకున్నాడు.

ఆ సమయం కాంతి సాంగత్యంతో అతనికి లభించింది. కాంతి అసలుపేరు పూర్వాశ్రమంలో పుష్పకాంతమ్మ. సెకండరీగ్రేడు పంతులమ్మ. ప్రేమలాటిదేదో పరాత్పరరావునూ కాంతమ్మనూ బంధించి వాళ్ళను దంపతుల్ని చేసింది. "సిన్మాల్లో ట్రై చెయ్యలేదు గాని - చేసి వుంటే ఈ మూడు భాషల్లో నేనే టాప్ ఆర్టిస్టునై వుండేదాన్ని" అన్న మన స్తత్వం ఆమెది. కాలు మీద కాలేసుకుని, సీటు వెనక్కి వాలి - జారిపో తున్న షిఫాన్ పైట సరిచేసుకుంటూ- ఆపిల్‌ముక్క కొరుకుతూ ఇంగ్లీష్‌పిక్చర్ చూడ్డానికి వెళ్లాలన్నంత గొప్పకోర్కెలున్నాయామెకు. ఆ కోర్కెలు ఫలిం చడం కోసం - ఆ జీవితం పొందడం కోసం — కాంతమ్మ ఏ పనైనా చెయ్యగలదు. శీలం - మాన మర్యాదలు - స్త్రీల కట్టుబాట్లు ఆమెకు వంటింటి స్త్రీలు మాట్లాడే విషయాలుగా కనుపిస్తాయి. కనుక ఈ విషయాలు ఆమె నెప్పుడూ బాధపెట్టవు. ఆమె ఆత్మ స్థయిర్యాన్ని సడలించ లేవు. పరాత్పరరావు — కాంతమ్మా ఒకే ఆశయం కోసం ఒకే త్రోవలో పయనిస్తున్నారు గనుక, వాళ్ళిద్దరి మనసులు కలసి వాళ్ళు ఆదర్శదంపతులయ్యారు.

"కోర్కెల కోసం మాన మర్యాదలు వదిలేసిన స్త్రీకి మొగుడైన సిగ్గులేని మగవాడు మహారాజ యోగకుడౌతాడు" అని అలా పైకొచ్చిన ప్రముఖులు మంటాపథంగా చెప్పిన విషయం పరాత్పరరావు జీవితంలో నిజమైంది. నాలుగు రోజుల్లో ఈ అంద మైన జంట అందరిలోనూ సంచలనం కలిగించింది. జంటిల్ వుమెన్ రావునూ, జంటిల్‌మన్ కాంతినీ లైక్ చెయ్యడం ప్రారంభించారు. పరువుతో బాటు పరాత్పరరావు ప్రారంభించిన చిన్న బిజినెస్ ప్రముఖుల చలువవలన పెద్ద బిజినెస్ అయికూర్చుంది. అందుచేత ఇప్పుడు కలక్టర్‌గారు ట్రాన్స్‌ఫరైనా, మంత్రిగారు వూళ్లోకివచ్చినా పరాత్పరరావు ఇంట్లో డిన్నర్ జరిగితీరుతుంది. అతనందరికీ తలలోని నాలుక. అలాగే బంగారు పిచ్చిక సదానందంకూడా. కాంతి - సదానందానికే డియరెస్టు ఫ్రెండు.

సదానందం అదృష్టం బావుంది. పరాత్పరరావు ఇంట్లోనే వున్నాడు. కాంతి కళ్ళతోనే తన నిష్ప హాయతను వెలిబుచ్చింది. సదానందం గినాటుకు

"ఎక్కడికి బాబూ!" అంటూ...

"చౌసకెళ్ళాలి" అన్నాడతడు.

"ఎక్కండి" అన్నాడొకడు.

"కాదు - బేరం నాది - రండి బాబూ - నాను ముందొచ్చేసినాను" అన్నాడొకడు.

"నోర్మూయ్యండి యధవల్లాలా - నానే ముందొచ్చేసినాను." అన్నాడింకొకడు.

నర్శిమ్ములు ఆశతో అరిచాడు. "నాదే బేరం! నన్నే ఆ అయ్యో పిలిసిండు - ఎక్కండి బాబూ." ఆకలి పుమంట అతనిచేత ఆ అబద్ధం ఆడించింది.

రిక్షావాళ్ళకు ఘర్షణ పెరిగింది. మాటలు విసురుకుంటున్నారు. ఈ సంగతి గ్రహించి ఆ వ్యక్తి "నాకసలు రిక్షావద్దు - ఏమీ వద్దు" అని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. బేరంపోయాక వీళ్ళకి తెలివొచ్చింది. అనవసరంగా ఎవరికీ కాకుండా ఓ బేరం పోయిందన్న బాధ అందరిలోనూ కన్పించింది.

"ఎందుకురా గొప్పోడు మానెడ్డోడు. మన పంచోళ్లని నొక్కేత్తన్నాడు పైకి రానీకుంటా! అని ఆడిపోసుకుంటున్నాం - మనలోనూ వున్నారుగుంటోళ్ళు - మనలో ఒడికి ఆ బేరం వదిలేత్తే యేం? అబ్బే! ఆగేదం లేదు మనకా - బీదోడే ఇంకో బీదోడికి అడ్డుకొడుతున్నప్పుడు గొప్పోడేకో నేత్తన్నాడని యేడుపు దేనికి?" అన్నాడు రాఘవులు రిక్షా వెనక్కి తిప్పుతూ—

నర్శిమ్ములు మళ్ళీ యధాస్థానికి రిక్షా తీసుకొచ్చి నిలబెట్టాడు. ఎదురుగావున్న ఒడ్డికొట్టు కెళ్ళి సింగిల్ టీ త్రాగి ఏడీ వెలిగించి బండిమీద కూర్చున్నాడు.

నర్శిమ్ములు తాతతండ్రుల దగ్గరనుండీ పల్లెలో పొలాల్లో కూలీనాలీ చేసుకుని లక్షణంగా బ్రతికినవాళ్ళు కాని నర్శిమ్ములు తరం వచ్చేటప్పటికి రోజులు మారాయి. ఆ పల్లెటూళ్ళలో కూలీనాలీ చేసుకుంటూ బ్రతకడంకన్నా టౌనుకెళ్ళి కాకీబట్ట లేసుకుని ఏ ఫ్యాక్టరీలోనన్నా పనిచెయ్యవచ్చని - ఓ శుభముహూర్తాన (సింగడిపెళ్ళాం) పైడితల్లిని (లేవ) తీసుకుని బెజవాడ బండెక్కాడు. కాళ్ళరిగేట్లు తిరిగినా ఫ్యాక్టరీపని కాదుగదా కూలిపనికికూడా పోటీ ఎక్కువై దొరకలేదు. చేసేదిలేక రిక్షా అద్దెకు తీసుకుని తొక్కడం ప్రారంభించాడు. బాగా సంపాదించిననాడు లక్షణంగా తిని - సారా తాగి పడుకుంటాడు. లేనినాడు - మంచినీళ్లు తాగి - బూతులు తిడుతూ మంచంమీదపడి దొర్లుతుంటాడు.

నర్శిమ్ములుకు కార్లలో తిరగాలని గొప్పోడినవ్వాలని కోర్కెలు లేవు. సమాజంలో తన స్థితి ఎందుకిలా అయిందన్న ఆలోచన లేదు. అయితే అనేకమంది అతనిలాటి వాళ్ళ మీద కథలు, గేయాలు వ్రాస్తున్నారని అతనికి తెలియదు. కాని ఓట్లు పండకల్లో జరిగిన మీటింగుల్లో పెద్దోళ్ళు ఎక్కువ మీలాంటోళ్ళకంతా ముందు భద్రతబతుకు లున్నాయి. మీదే రాజ్యం - లేవండి - పరుగెత్తండి - అని ఏవేవో ఆవేశంలో అరుస్తూంటే ఒక్కముక్క అర్థంగాకపోయినా నర్శిమ్ములు చేతులు పేలేట్లు చప్పట్లుకొట్టి - రాఘవులు వై అనమంటే ఓపిక వున్నంత వరకూ జై అని అరచి ఇంటికెళ్ళిపోయి గంజితాగి పడుకున్నాడు.

తనకు జీవితం మారట మేమిటో అర్థంగాలేదు నర్శిమ్ములికి మొట్టమొదట. అయితే రాఘవులు నర్శిమ్ములికి అన్నీబోధపర్చాడు. మనకూ స్వాతంత్ర్యం వుందన్నాడు. మనశ్రమకు ఫలితందక్కాలన్నాడు అదేదో సంఘం ద్వారా గివర్నమెంటోడితో పోట్లాడొచ్చన్నాడు. కూలీలే కొన్నాళ్ళకు దేవుడన్నాడు. అబ్బా అని ఆశ్చర్యపోయాడు నర్శిమ్ములు. తర్వాత అతనికీ అనుభవ మొచ్చింది. ఇప్పుడతను కార్మికులనుండి - భారత రాజ్యాంగ హక్కుల వరకూ మాట్లాడ గలడు. ఏమైనా అతని బ్రతుకు మాత్రం మారలేదు. అతని బ్రతుకు దినదిన గండంగానే గడుస్తోంది. అతని ముగ్గురు కొడుకులూ మూడు హోటళ్ళలో క్లీనర్లుగా వున్నారు. ఒకడు చదువుతానంటే వీపు చిట్లగొట్టి పనికి పంపించాడు.

ఎవరో రిక్షా దగ్గరకు రావడం చూసి లేచి నిల్చున్నాడు. 'లక్ష్మీసదనం'కు బేరం - చాలా దూరం - ఆఖరికి రూపాయికి బేరం కుదిరింది.

"రూపాయి" కళ్ళ ముందాడుతూ నర్శిమ్ములు వంట్లో వుషారు పుట్టించింది. అరగంటలో ఆ వ్యక్తిని దింపి ఈలవేస్తూ తిరుగుముఖం పట్టాడు. దారిలో ఓ చిన్న గుడిసె దగ్గర రిక్షా ఆపి లోపలికి వెళ్ళి సురాపానీయం పుచ్చుకుని మళ్ళీ రిక్షాతొక్కనారంభించాడు.

వూళ్లోకి అడుగు పెడుతూండగా ఎక్కడనుండో ఒక కారు టర్నింగ్ స్పీడ్‌గా తిరిగింది. నర్శిమ్ములు కళ్లు జిగేల్‌మన్నాయి. రిక్షాను తప్పించడానికి ప్రయత్నించాడు. అప్పటికే ఆలస్యమైంది. కారు బలంగా రిక్షాని గుద్దింది. నర్శిమ్ములు ఎగిరి అవతల పడ్డాడు. ఒళ్ళంతా గీరుకుపోయింది. రిక్షాతుక్కు తుక్కు వయిపోయింది.

కార్లోనుండి ఒక వ్యక్తి రిక్షా డ్రైవర్ని తిడుతూ కిందికి దిగాడు. అతని నోట్లోనుంచి బ్రాందీ వాసన గుప్పుమంటోంది.

"ఏరా! కళ్లు కొవ్వెక్కాయా!!" అన్నాడా వ్యక్తి కోపంగా! నర్శిమ్ములు ఒళ్లు మండింది. "నాదేం తప్పులేదు. కారులో రాంగ్‌సైడు వచ్చావు. నీదే తప్పు." అన్నాడు మోటుగా.

జనమంతా కారువ్యక్తిదే తప్పని రిక్షావాణ్ణి సమర్థించారు. ఆ వ్యక్తి చుట్టూవున్న జనం సంగతి గ్రహించి నర్శిమ్ముల్ని చూసి "పోనీయ్! ఎవరిది తప్పయితే ఏంలే! పాపం బీదాడివి - వుంచుకో ఈ పాతిక." అన్నాడు.

"అక్కర్లేదు - నీదితప్పు - మా సంఘానికి రిపోర్టు చేస్తాను - మొత్తం రిక్షాడబ్బులు కట్టిస్తాను." అన్నాడు పెంకెగా.

నర్శిమ్ములు మాటలకు తను జంకాడు. జనం ఎక్కువయ్యారు. అతను నర్శిమ్మూర్తిని బ్రతిమాలాడు. నర్శిమ్ములు ససేమిరా ఒప్పుకోలేదు.

వెంటనే ఆ వ్యక్తి ప్రక్కనున్న ఒక షాపు కెళ్ళి సర్కిల్‌కి ఫోన్ చేశాడు. "హలో! నేను సదానందాన్ని మాట్లాడుతున్నా. ఒక చిన్న యాక్సిడెంటు అయింది. ఆ! రిక్షావాడిదే తప్పు - పైగా తప్పతాగి వున్నాడు వెధవ - అందుకే ఫోన్ జేశాను." అన్నాడు.

"ఓ! మీరా! గుడ్ యీవెనింగ్ సర్! వాణ్ణి మాసార్జెంటు వచ్చి లాకప్‌లో పడేస్తాడులెండి. మీరు మాసార్జెంటు రాగానే వాడినప్పగించి - స్టేట్‌మెంటు యిచ్చి వెళ్ళిపోండి" అన్నాడు.

అయిదు నిముషాల్లో సార్జెంటు వచ్చి నర్శిమ్ముల్ని లాక్కెళ్ళాడు. పోలీసుల జోక్యం వచ్చేసరికి నరసింహుల్ని సపోర్టుచేసిన జనం చెల్లాచెదురైపోయారు. ఠీవిగా కారులో కూర్చుని వెళ్ళిపోయాడు సదానందం.

సదానందం యింటికి వెళ్ళేసరికి ఒక కుర్రాడు వచ్చాడు. అసలే విసుగ్గావున్న సదానందం ఆ కుర్రాడి వైపు నిర్లక్ష్యంగా చూశాడు.

"నా పేరు సత్యమూర్తి సార్! బీదవాణ్ణి - ఏదైనా వుద్యోగం - దయచేసి—"

చర్రున కోపం వచ్చింది సదానందానికి.

"ఏవిటీ! బీదాడివా! అవునోయ్ మీరు బీదవాళ్ళయినా రూల్సు మాట్లాడతారుగా రూల్సు! మీకు సాయం చెయ్యడంకూడానా! నేనేం వుద్యోగాలు తేరగా పెట్టుకుని కూర్చున్నాననుకున్నావా? అసలిలాటి డర్టీరోగ్స్‌ను లోపలికి రానిచ్చిందెవరు? నేనేం చెయ్యను వెళ్లు - గెటవుట్!!" పెద్దగా అరిచాడు సదానందం.

ఈ హఠాత్పరిణామానికి నిర్ఘాంతపోతూ జారిపోయిన గుండెలతో బయటకు పరిగెత్తాడు పాపం! సత్యమూర్తి.

* * * * *

జనం! జనం! ప్రజ ప్రజ!! వారం రోజుల తర్వాతకూడా సెంటరు అదే జనంలో కిటకిటలాడుతోంది. మామూలుగా అన్ని రకాలవాళ్ళూ చేరారక్కడ! అన్ని వ్యాపారాలు సజావుగా సాగుతున్నాయి.

నాలుగు రోజులు జైల్లో కూర్చున్న నర్శిమ్ములు రిక్షా మళ్ళీ త్రొక్కుతూ సెంటర్లో బేరంకోసం ఎదురు చూస్తున్నాడు.

ఇంకొక ఇంజనీర్ ఎవరో రమ్మన్నారని కలుసుకోవడానికి వెళ్ళాలనుకుంటూ సత్యమూర్తి ఒక పెద్ద హోటల్‌కెళ్ళి మంచినీళ్లుతాగి పేవ్‌మెంట్ మీద నిల్చుని జనాన్ని చూస్తున్నాడు.

ఎయిర్ కండిషన్డు హోటల్లోనుండి ట్రిమ్ముగా మల్లెపూవులా బయటకొచ్చిన సదానందం గోల్డుఫ్లేక్ సిగరెట్ వెలిగించి కారులో కూర్చుని రమ్మీ ఆడడానికి క్లబ్బుకు బయల్దేరాడు.

"దేశమంటే మనుజులోయ్" అన్న గురజాడ వారి పాట ప్రతిధ్వని స్తున్నట్లు సెంటర్ సందడిగా వుంది.